
సాక్షి మహబూబ్‌నగర్

శనివారం : 4 : నవంబర్ : 2023



జెండా పాతేదెవరు?

జడ్చర్లలో జెండా పాతేందుకు అన్ని ప్రధాన పార్టీలు పోటీ పడుతున్నాయి.

వివరాలు IIలో ▸



ఏసీబీ దాడుల కలకలం

నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో ఏసీబీ అధికారుల దాడులు కలకలం సృష్టించాయి.

వివరాలు IIలో ▸

గరిష్టం/కనిష్టం
31.2 /17.9

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రి చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు ఉంటుంది.

న్యూస్‌రీల్

క్షేత్రస్థాయిలో పరిశీలించిన పీఎంయూ బృందం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని వివిధ వార్డుల్లో శుక్ర వారం పీఎంయూ రాష్ట్ర స్థాయి బృందం (ఆస్కీ) సభ్యులు ఉదయ్ సింగ్, అఖిల్‌రెడ్డి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఇందులో భాగంగా శ్రీనివాసకాలనీ, రాజేంద్రనగర్, పుట్నాలబట్టి, టీడీగుట్ట, పాత బస్టాండ్ తదితర ప్రాంతాల్లో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికీ వెళ్లి స్వచ్ఛ ఆటోల ద్వారా తడి, పొడి చెత్తను వేరుచేసి సరిగా సేకరిస్తున్నారా? లేదా? అనేది క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే ఎక్కడైనా చెత్తను కాల్చివేస్తున్నారా? అనేది ఆరా తీశారు. వీటికి సంబంధించి కొన్ని ఫొటోలు తీసుకుని తిరిగి హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. కాగా, ఈ బృందం మొదటిరోజు కోయిల్‌కొండ ఎక్స్ రోడ్డు సమీపంలోని డంపింగ్ యార్డును పరిశీలించిన అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందిని కలిసి అభిప్రాయాలు సేకరించారు.

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన



దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో ఈ నెల 6వ తేదీన న సీఎం కేసీఆర్ పాల్గొనే ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు తరలి రావాలని ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెత్తాలని తెలిపారు. సభావేదిక, ఏర్పాట్ల పనులు వేగవంతగా పూర్తి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు రాజశేఖర్‌రెడ్డి, జట్టి నర్సింహారెడ్డి, వెంకటేశ్, శ్రీకాంత్ యాదవ్, కరణంరాజు, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కొండారెడ్డి, బాల్‌రాజు, చల్మారెడ్డి, రాము పాల్గొన్నారు.

■ డీఎస్పీ రమణారెడ్డి శుక్రవారం సీఎం పాల్గొనే సభ స్థలిని పరిశీలించారు. సభ జరిగే ప్రాంతంలో చేపట్టవల్సిన బందోబస్తుపై ఇతర పోలీసు అధికారులతో చర్చించారు.

ఫలితాలు విడుదల

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: టీటీసీ లోయర్ గ్రేడ్ ఫలితాలు వెల్లడైనట్లు డీఈఓ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్కులు, ఫలితాలు తెలంగాణ విద్యాశాఖ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

జాబ్‌మేళా..

జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో, యాక్సిస్ బ్యాంక్ సహకారంతో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలో 57మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

కమ్యూనిటీ మూమెంట్

ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో కమ్యూనిటీ మూవ్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు భాషపై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలని సూచించారు.

6న ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా వాలీబాల్ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 ఉమ్మడి జిల్లా బాలబాలికల వాలీబాల్ జట్ల ఎంపికలను ఈ నెల 6న ఉదయం 9 గంటలకు జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహక కార్యదర్శి పాపిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొనే విద్యార్థులు ఇంటర్ మీడియట్ బోనఫైడ్, ఎస్ఎస్‌సీ జిరాక్స్‌తో హాజరు కావాలని ఆయన కోరారు. మిగతా వివరాల కోసం కోచ్ పర్వేజ్ (7780582604) నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సోనామసూరి ధర రూ.2,326

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగిన ఈనామ్ టెండర్లలో సోనామసూరి ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,326, కనిష్టంగా రూ.1,909గా ధరలు నమోదయ్యాయి. హంస ధాన్యం ధర గరిష్టంగా రూ.1,863, కనిష్టంగా రూ.1,759గా ధరలు లభించాయి. వరి కోతలు ప్రారంభం కావడంతో మార్కెట్‌కు 5 వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

పాలమూరు విద్యార్థుల ప్రతిభ

- అంతర్జాతీయ సైన్స్ ప్రదర్శనకు హన్వాడ, అలంపూర్ విద్యార్థినులు
- అభినందించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- వివరాలు IIలో..



ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమానికి హాజరైన విద్యార్థినులు

నిజాయతీకి పట్టం కడదాం

ఓటుతోనే సమ సమాజ నిర్మాణం..

- ఎట్టి పరిస్థితుల్లో దుర్వినియోగం చేయొద్దు
- యువత అవగాహనతో ఓటు వేయాలి
- ప్రభుత్వాలు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి
- 'ఎన్నికలు–నాయకుడి ఎన్నిక' అంశంపై 'సాక్షి' ఆధ్వరంలో అవగాహన

అసెంబ్లీ ఎన్నికల్లో నిజాయతీ, నిబద్ధత గల నాయకులకు పట్టం కడదామని మహబూబ్‌నగర్ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు పిలుపునిచ్చారు. 'సాక్షి' ఆధ్వర్యంలో 'ఎన్నికలు–నాయకుడి ఎన్నిక' అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి విద్యార్థుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సామాన్యులకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ఎంతో గొప్పదని, దాన్ని సక్రమంగా వినియోగించుకుంటేనే ఐదేళ్ల పాలన సుభిక్షంగా సాగుతుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటును దుర్వినియోగ పర్చవద్దని కోరారు. ముఖ్యంగా యువత అవగాహనతో ఓటు వేయాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వాలు యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో వసతులు కల్పించాలని పేర్కొన్నారు.

– మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్

అవగాహనతో ఓటు వేయాలి..



చాలా మంది విద్యార్థులు కొత్తగా ఓటు హక్కు పొందుతారు. వారు అవగాహనతో ఓటు వేసి నీతి, నిజాయతీగల నాయకులను ఎన్నుకోవాల్సిన అవసరం ఉంది. గతంలో పనిచేసి తప్పిదాలు చేసిన వారి కి ఎట్టి పరిస్థితిలో మరోసారి అవకాశం ఇవ్వకూడదు. దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి.

– శిరీష

ఓటు ఎంతో విలువైంది..



సామాన్యులకు ఓటు ఆయుధం లాంటిది. ఓటుతో మంచి వ్యక్తులను ఎన్నుకుంటే అందరి ఆశయాలకు అనుగుణంగా పని చేస్తారు. ఓటును దుర్వినియోగ పరిస్తే దాని పర్యవసనాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. యువత నిజాయతీగా ఓటు వేయాలి.

– లావణ్యశ్రీ

కళాశాలల్లో వసతులు కల్పించాలి..



ప్రభుత్వ కళాశాలల్లో పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలి. బాలికల జూనియర్ కళాశాలల్లో విద్యార్థినులు ఇబ్బందులు పడకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలి. ల్యాబ్‌లు, మరుగుదొడ్లు, తరగతి గదుల వంటివి అభివృద్ధి చేయాలి. లేదంటే పేద విద్యార్థినులు మెరుగైన విద్యను పొందలేదు.

– సాలేహా తబస్సుమ్

ప్రజల మధ్య సమానత్వం అవసరం..



వ్యవస్థలో ప్రజలు సమానంగా ఎదిగినప్పుడు మాత్రమే దేశం అభివృద్ధి చెందుతుంది. లింగ భేదం లేకుండా సమాన విద్య అందేలా చూడాలి. ప్రతి పౌరుడు ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా సొంతంగా నిర్ణయం తీసుకోవడం వల్ల సమాజంలో మార్పు సాధ్యమవుతుంది. సమాజానికి మేలు చేసే వ్యక్తులను ఎన్నుకోవాలి.

– పుష్పలత, అధ్యాపకురాలు

● 'సాక్షి' అవగాహన

ప్రజాసమస్యలు పరిష్కరించాలి..



ప్రజాప్రతినిధులను ఎన్నుకునే క్రమంలో ప్రతి పౌరుడు కూడా అవగాహనతో వ్యవహరించాలి. ఎన్నికల ముందు ఒకలా, తర్వాత ఒకలా వ్యవహరించే వారితో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. ప్రలోభాలకు గురికాకుండా న్యాయంగా వ్యక్తుల ఎన్నికలు జరగాలి.

– నవ్యశ్రీ.

తాత్కాలిక ప్రయోజనాలు వద్దు



ఎన్నికల సమయంలో ప్రజలు స్వల్ప ప్రయోజనాలను చూసుకుని, ఐదేళ్లు పరిపాలించే వారిని తప్పుగా ఎన్నుకోవద్దు. ప్రజాప్రతినిధులు ఇచ్చే ఉచితాలతో దేశ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది. అందుకే దీర్ఘకాలిక ప్రయోజనాలు కలిగే విధంగా పార్టీలు, నాయకులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– అరుణ

పంటలకు మద్దతు ధర ఇవ్వాలి



ఆరుగాలం కష్టించి పండించే పంటకు మద్దతు ధర ఇవ్వడం వల్ల రైతుల జీవితం బాగుపడుతుంది. పంట సాగుకు సహాయం చేసే దానికంటే మద్దతు ధర పెంచితే రైతులు మరింత లాభపడతారు. ప్రభుత్వాలు ఉచితాలు ఇవ్వడంతో తీవ్ర నష్టం వాటిల్లుతుంది.

– అఖిల

ఉచితాలతో జీవితాలు మారవు



చాలా మంది యువత చదువుకున్నప్పటికీ అర్హతకు అనుగుణంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడం లేదు. ప్రభుత్వాలు ఉద్యోగాలు సృష్టించే విధంగా కృషి చేయాల్సిన అవసరం ఉంది. ఉద్యోగాలు వస్తే ప్రతి వ్యక్తి జీవితంలో మార్పులు వస్తాయి. ఉచితాలతో జీవితాలు మారవు.

– పి.జ్యోతి

బాధ్యత లేని వారిని ఎన్నుకోవద్దు..



ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన వారు ప్రజాసమస్యలు పట్టించుకోకుండా అడ్డగోలు దోపిడీకి పాల్పడుతున్న విషయాన్ని తరచూగా చూస్తుంటాం. వారి కుటుంబ అభివృద్ధి తప్ప మరేమీ వారికి పట్టదు. ఈ ఎన్నికల నుంచి ప్రజలు మార్పు దిశగా ఆలోచించి నిజాయతీగా పని చేసే వ్యక్తులను ఎన్నుకోవాలి.

– సుప్రజ

తొలిరోజు 6 నామినేషన్లు..

అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

- కొల్లాపూర్‌లో రెండు నామినేషన్లు దాఖలు
- మహబూబ్‌నగర్, కల్వకుర్తి, అలంపూర్, నాగర్‌కర్నూల్‌లో ఒక్కొక్కటి చొప్పున..
- కొడంగల్‌లో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తరఫున నామినేషన్
- 6, 7,9 తేదీల్లో ఎక్కువగా వచ్చే అవకాశం



మహబూబ్‌నగర్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి ఇంతియాజ్ అహ్మద్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ జెడ్పీసెంటర్: అసెంబ్లీ ఎన్నికల కోసం అధికారులు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. తొలి ఘట్టంలో భాగంగా ఈ నెల 3వ నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలోకి వెళ్లిన షాద్‌నగర్, వికారాబాద్ పరిధిలో ఉన్న కొడంగల్ మినహా ఉమ్మడి జిల్లా పరిధిలో 12 నియోజకవర్గ కేంద్రాల్లో నామినేషన్లకు సంబంధించి తొలి రోజు ఆరు దాఖలయ్యాయి. కొల్లాపూర్‌లో ఇద్దరు, మహబూబ్‌నగర్, అలంపూర్, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్‌లో ఒకరు చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని షాషాబ్‌గుట్టకు చెందిన మహ్మద్ ఇంతియాజ్ అహ్మద్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయగా.. నాగర్‌కర్నూల్‌లో కె.శంకర్ అనే వ్యక్తి స్వతంత్ర అభ్యర్థిగా సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి పార్టీ నుంచి సైతం నామినేషన్ వేశారు. కొల్లాపూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి భార్య విజయ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆమె పేరుతో, అదేవిధంగా బీజేపీ అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు పేరిట ఆయన కూతురు తేజస్విని నామినేషన్ దాఖలు చేశారు. కల్వకుర్తిలో స్వతంత్ర అభ్యర్థిగా రాజుగౌడ్, అలంపూర్‌లో స్వతంత్ర అభ్యర్థిగా ప్రేమలత నామినేషన్లు వేశారు. కాగా.. కొడంగల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తరఫున ఆయన సోదరుడు తిరుపతి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి నామినేషన్ వేశారు.

■ మహబూబ్‌నగర్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవినాయక్ ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఎలాంటి లోపం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని సిద్ధం చేశారు. దేవరకద్ర, జడ్చర్ల నియోజకవర్గాలకు సంబంధించి ఆయా పట్టణాల్లోని తహసీల్దార్ కార్యాలయాలను ఆర్ఓ కార్యాలయాలుగా మార్చారు. అభ్యర్థులకు నామినేషన్ ఫారాలను ఉచితంగానే అందజేస్తున్నారు. అయితే అభ్యర్థులు మంచి ముహూర్తాలు చేసుకుని నామినేషన్లు వేసేందుకు సిద్ధం అవుతున్నారు. భారీ ర్యాలీలతో నామినేషన్ల ప్రక్రియ రోజే తమ బలాన్ని ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కాగా.. ఈ నెల 6, 7, 9 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉండడంతో ఆ మూడు రోజుల్లో ఎక్కువ నామినేషన్లు వచ్చే అవకాశం ఉంది.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవినాయక్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): అసెంబ్లీ ఎన్నికలను జిల్లాలో స్వేచ్ఛాయువత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ రవినాయక్ వెల్లడించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎస్పీ హర్షవర్ధన్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని, ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. 10వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి అర్బన్ తహసీల్దార్ కార్యాలయం, జడ్చర్ల నియోజకవర్గానికి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో, దేవరకద్రకు దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను స్వీకరించారని చెప్పారు. 15వ తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు ఉపసంహరించుకోవచ్చని తెలిపారు. 30న పోలింగ్, డిసెంబర్ 3న లెక్కింపు ఉంటుందన్నారు. అక్టోబర్ 4న ప్రచురించిన తుది ఓటరు జాబితా ప్రకారం మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో 2,43,331 మంది ఓటర్లు, జడ్చర్లలో 2,12,384 మంది ఓటర్లు, దేవరకద్రలో 2,28,077 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. 80 ఏళ్లు దాటిన వారు, 40 శాతానికి మించి అంగ వైకల్యం ఉన్న వారికి ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన రోజు నుంచి 24 గంటలు పనిచేసేలా స్టాటిస్టికల్ సర్వేలైన్ బృందాలు, వీడియోవీవింగ్ బృందాలు నియోజకవర్గంలో తిరుగుతున్నట్లు తెలిపారు. ప్రతి మండలంలో 5 పోలీస్‌స్టేషన్లు, మూడు మహిళా కేంద్రాలు, ఒక దివ్యాంగుల పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ శాఖ తరఫున ఎన్నికలకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి నియోవజకవర్గంలో ఒక పోలీస్ అధికారిని నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. జిల్లాలో 5 అంతర్ జిల్లా చెక్ పోస్టులును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికలకు ఇబ్బందులు కలిగించే వారిని ముందే గుర్తించి బైండోవర్ చేస్తున్నట్లు వివరించారు. భద్రత విషయమై సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ జిల్లాకు వచ్చారన్నారు. సమావేశంలో జడ్చర్ల రిటర్నింగ్ అధికారి మోహన్ రావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దేవరకద్ర-కృష్ణా రైల్వే విద్యుదీకరణ పూర్తి

- రైళ్ల రాకపోకలు ప్రారంభం
- ముఖ్య నగరాలకు తగ్గనున్న దూరం



దేవరకద్ర-కృష్ణా మార్గంలో పూర్తయిన విద్యుదీకరణ

దేవరకద్ర: మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నుంచి నారాయణపేట జిల్లా కృష్ణా రైల్వేస్టేషన్ వరకు విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయి. శుక్రవారం నుంచి రైళ్ల రాకపోకలు ప్రారంభమయ్యాయి. మహబూబ్‌నగర్–మునీరాబాద్ రైల్వేలైన్‌లో భాగంగా ఇటీవల చేపట్టిన బ్రాడ్ గేజ్ లైన్ పనులు పూర్తి కావడంతో డెమో రైలును ప్రారంభించారు. రైల్వే ప్రయాణికులకు మరిన్ని సేవలు అందించేందుకుగాను దేవరకద్ర నుంచి మరికల్, జక్లేర్, మక్తల్, మాగనూర్ మీదుగా కృష్ణా రైల్వేస్టేషన్ వరకు 64 కిలోమీటర్ల మేర విద్యుద్దీకరణ పనులు శరవేగంగా పూర్తి చేశారు. దీంతో హైదరాబాద్ నుంచి రాయచూర్, గుంతకల్, బళ్లారి, హుబ్లీ, గోవా వంటి దక్షిణాది రాష్ట్రాల్లోని ముఖ్యమైన నగరాలకు అత్యంత అందుబాటులో ఉండే మార్గంగా దేవరకద్ర–కృష్ణా రైల్వేలైన్ మారబోతోంది. దాదాపు అన్ని రూట్లకు వంద కిలోమీటర్ల మేర దూరం తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ రూట్‌లో డెమో ప్యాసింజర్ రైలుతో పాటు గూడ్స్ రైళ్లను నడుపుతున్నారు. ఈ ప్రత్యామ్నాయ మార్గం ద్వారా ఇనుప ఖనిజం, సిమెంట్, ఉక్కు వంటి భారీ వస్తువులను రవాణా చేసే అవకాశం ఉంది. ఈ మార్గంలో త్వరితగతిన విద్యుద్దీకరణ పూర్తి చేసిన నిర్మాణ, ఎలక్ట్రిక్ విభాగాల అధికారులను దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ అభినందించారు.

వృత్తి నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు

మహబూబ్‌నగర్ క్రీడలు: వృత్తి నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రం పాత డీఈఓ కార్యాలయంలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో వచ్చేనెల 20 తేదీ తేదీ నుంచి 12వ బ్యాచ్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి పాస్ లేదా ఫెయిల్‌పై మూడు నెలల పాటు కంప్యూటర్ కోర్స్ (ఎంఎస్ ఆఫీస్), బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, గార్మెట్ తయారీ, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండీషనర్ రిపేర్, మొబైల్ సర్వీసింగ్, రిపేర్ అంశాల్లో, 7వ తరగతి పాస్‌పై జర్దోసి–మగ్గం, ఎలక్ట్రీషియన్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం హైదరాబాద్ సెట్విన్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణత అయిన అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేస్తామని వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు వృత్తి నైపుణ్య శిక్షణకేంద్రంలో ఈనెల 18 వరకు దరఖాస్తుతో పాటు విద్యార్హత, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, కులం సర్టిఫికెట్లను అందజేయాలని కోరారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులు అందజేయాలని, మిగతా వివరాల కోసం శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి ఎస్.విజయ్‌కుమార్ (9441565895) ను సంప్రదించాలని కోరారు.

విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన అవసరం




విత్తనోత్పత్తి వరి సాగును పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

చిన్నచింతకుంట: రైతులు విత్తనోత్పత్తిపై అవగాహన కలిగి ఉండాలని ఇరి రీసర్చ్ లీడర్ ఇన్ జండర్ అండ్ లివింగ్ హుడ్స్ శాస్త్రవేత్త రంజిత పుష్కర్ తెలిపారు. మండలంలోని అప్పంపల్లిలో అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ, సుస్థిర వ్యవసాయ కేంద్రం సహకారంతో శుక్రవారం మహిళా రైతులకు యాజమాన్య పద్ధతి, విత్తనోత్పత్తిపై క్షేత్ర స్థాయి సమావేశం నిర్వహించారు. వ్యవసాయ రంగంలో మహిళలు ముందుకు రావాలన్నారు. అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ, సుస్థిర వ్యవసాయ కేంద్రం రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించి అధిక దిగుబడులు సాధించేలా కృషి చేస్తుందన్నారు. దళారి వ్యవస్థను రూపు మాపేలా పండించిన పంటను నేరుగా కొనుగోలు చేస్తుందన్నారు. నాణ్యమైన ఫౌండేషన్ సీడును అందించి వారి చేత విత్తన ఉత్పత్తిని చేయిస్తుందన్నారు. రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘంలో సభ్యత్వం పొంది వారి సలహా సూచనలతో అధిక దిగుబడులు సాదించి అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం రైతులు సాగుచేసిన విత్తనోత్పత్తి వరిసాగును పరిశీలించారు. కార్యక్రమంలో ఇరి ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ బిజినెస్ మేనేజర్ సుల్తాన్, రాజశేఖర్‌రెడ్డి, ఏఓ రాజేష్‌ఖన్న, శ్రీజ, రైతులు పాల్గొన్నారు.

శబరిమలకు ఆర్టీసీ అద్దె బస్సులు: ఆర్‌ఎం

స్టేషన్ మహబూబ్‌నగర్: అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం శబరిమలకు ఆర్టీసీ అద్దె ప్రాతిపదికన సూపర్‌బస్సులు నడుపనున్నట్లు రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం విలేజ్ బస్సు అధికారులతో సమీక్ష నిర్వహించారు. డిపోల వారీగా వీబీఓల పనితీరును అడిగి తెలుసుకున్నారు. శబరిమల, పంచారామాలు, కార్తీక మాసం, అరుణాచాలం వంటి క్షేత్రాలకు భక్తులు దర్శించుకోవడానికి ఆర్టీసీ బస్సును ఎలా బుక్ చేసుకోవాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ సురక్షితులైన డ్రైవర్లతో శబరిమలైకు బస్సులు నడపడానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బస్సులో టీవీ సౌకర్యం ఉంటుందని, ఇద్దరు మణికంఠస్వాములు, ఇద్దరు వంట మనుషులు, సామాన్లు సర్దేందుకు ఒక వ్యక్తి ఉచితంగా (సీటు లేకుండా) ప్రయాణించడానికి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. బస్సును అద్దెకు బుక్ చేసిన గురుస్వామికి ఉచిత ప్రయాణం ఉంటుందని, ఒకటి కంటే ఎక్కువ బస్సులు బుక్ చేస్తే ఆ బస్సులపై రోజుకు రూ.300 చొప్పున కమిషన్ అందజేస్తామని తెలిపారు. బస్సులు కావాల్సిన వారు సమీపంలోని డిపో మేనేజర్లను సంప్రదించాలని ఆమె కోరారు. సమావేశంలో డిప్యూటీ ఆర్‌ఎం శ్యామల, డీఎం సుజాత, సీఐ మోసీస్‌బాను తదితరులు పాల్గొన్నారు.






జడ్చర్లలో జెండా పాతేదెవరు?

'పరిశ్రమల' నియోజకవర్గంలో బీసీల ప్రాబల్యం

- 1962లో తొలి అసెంబ్లీ ఎన్నికలు.. స్వతంత్ర అభ్యర్థి కొత్త కేశవులు గెలుపు
- ఇటీవలి రెండు ఎన్నికల్లో గులాబీ జెండా రెపరెపలు
- హ్యాట్రిక్ కోసం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తహతహ
- తొలి గెలుపు కోసం అనిరుధ్‌రెడ్డి తపన


జడ్చర్ల పట్టణ వ్యూ

జడ్చర్ల: పరిశ్రమల వాడగా గుర్తింపు పొందిన జడ్చర్ల నియోజకవర్గంలో పాగ వేసేందుకు ప్రధాన పార్టీలు పోటీ పడుతున్నాయి. ఈ ఎన్నికల్లో విజయం సాధించి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా నిలవాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి తహతహలాడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున మొదటి సారిగా బరిలో నిలిచిన అనిరుధ్‌రెడ్డి విజయం సాధించాలన్న పట్టుదలతో ముందుకు సాగుతున్నారు. 1961లో జడ్చర్ల నియోజకవర్గం ఏర్పడగా, 1962లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఐదు సార్లు టీడీపీ విజయం సాధించగా.. నాలుగు సార్లు కాంగ్రెస్, మూడు సార్లు స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. 2004లో కాంగ్రెస్ మద్దతుతో బీఆర్‌ఎస్ గెలుపొందగా, 2008లో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం సాధించింది. 2009లో బీఆర్‌ఎస్ మద్దతుతో టీడీపీ గెలుపొందగా.. 2014, 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి విజయం సాధించారు.

రెండు ఉప ఎన్నికలు..

జడ్చర్ల అసెంబ్లీ స్థానానికి రెండు సార్లు ఉప ఎన్నికలు వచ్చాయి. 1996లో టీడీపీకి చెందిన ఎం.సత్యనారాయణ హత్యకు గురి కావడంతో ఉపఎన్నిక రాగా, అతడి సోదరుడు ఎం.చంద్రశేఖర్ మొదటి సారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాడు. అదేవిధంగా తెలంగాణ ఉద్యమంలో భాగంగా 2008లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తన పదవికి రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి విజయం సాధించారు.

బీసీ నియోజకవర్గంగా గుర్తింపు..

నియోజకవర్గంలో బీసీ ప్రాబల్యం ఎక్కువగా ఉండటంతో బీసీ అభ్యర్థులకు మొదటి నుంచి కలిసి వస్తోంది. మొదటి నుంచి జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే.. 1972, 1978లలో నిర్వహించిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చెందిన బీసీ అభ్యర్థి నర్సప్ప ఎన్నికయ్యారు. 1994 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఎర్ర సత్యనారాయణ విజయం సాధించారు. ఆయన మరణానంతరం ఆయన సోదరుడు ఎర్ర శేఖర్ రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. తర్వాత జడ్చర్ల మండలం నాగసాలకు చెందిన ఎం.కృష్ణారెడ్డి ఒకసారి ఇండిపెండెంట్‌గా, మరోసారి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఎన్నికయ్యారు. వీరి తర్వాత రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులు విజయం సాధిస్తూ వచ్చారు.

అత్యధిక, అత్యల్ప మెజార్టీలు..


ఎం.సత్యనారాయణ (ఎర్ర సత్యం)

1994 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన మరాఠి సత్యనారాయణకు 72,758 ఓట్లు పోలవ్వగా, 53,779 మెజార్టీతో విజయం సాధించారు. 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సుధాకర్‌రెడ్డి తన సమీప టీడీపీ అభ్యర్థి ఎం.కృష్ణారెడ్డిపై కేవలం 1,051 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

స్వతంత్ర అభ్యర్థుల విజయం..

1962లో కొత్త కేశవులు ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందగా.. 1967లో ఎల్‌ఎన్.రెడ్డి (లక్ష్మీనర్సింహారెడ్డి) ఇండిపెండెంట్‌గా గెలుపొందారు. 1983లో ఎం.కృష్ణారెడ్డికి టీడీపీ బీఫాం సకాలంలో అందకపోవడంతో ఆయన ఇండిపెండెంట్‌గా విజయం సాధించారు.

తొలి ఎమ్మెల్యే కొత్త కేశవులు..


కొత్త కేశవులు

జడ్చర్ల నియోజకవర్గం ఏర్పడిన తర్వాత 1962లో మొదటిసారిగా జరిగిన ఎన్నికల్లో పట్టణానికి చెందిన కొత్త కేశవులు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన కొత్త కేశవులు.. సమీప కాంగ్రెస్ అభ్యర్థి కె.జనార్దన్‌రెడ్డిపై 4,830 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. కొత్త కేశవులుకు 17,927 ఓట్లు రాగా, జనార్దన్‌రెడ్డికి 13,097 ఓట్లు వచ్చాయి.

హ్యాట్రిక్ దక్కేనా?


ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల అసెంబ్లీ స్థానానికి ఇప్పటివరకు వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎవరూ గెలుపొందలేదు. మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయినా.. వరుసగా విజయం సాధించకపోవడంతో ఎవరికీ హ్యాట్రిక్ దక్కలేదు. టీడీపీ నుంచి ఎం.చంద్రశేఖర్ (ఎర్ర శేఖర్) 1996, 1999, 2009 ఎన్నికల్లో గెలుపొందారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సి.లక్ష్మారెడ్డి 2004, 2014, 2018 ఎన్నికల్లో గెలపొందారు. ఈ విడత ఎన్నికల్లో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి గెలుపొందితే హ్యాట్రిక్ దక్కుతుంది.



భౌగోళిక స్వరూపం..

జడ్చర్ల నియోజకవర్గంలోని ఊర్కొండ మండలం నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉండగా, మిగతా ఐదు మండలాలు మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్నాయి. అదేవిదంగా ఓ వైపు 44వ జాతీయ రహదారి ఉండగా.. మరో వైపు 167వ నంబర్ జాతీయ రహదారి ఉంది. నియోజకవర్గంలో జడ్చర్ల, బాలానగర్, రాజాపూర్, నవాబుపేట, మిడ్జిల్, ఊర్కొండ మండలాలు ఉన్నాయి.

ఓటర్ల వివరాలు..

మహిళలు 1,05,469	పురుషులు 1,06,922
ఇతరులు 4	మొత్తం ఓటర్ల సంఖ్య 2,21,395
పోలింగ్ కేంద్రాల సంఖ్య: 274	

2018 ఎన్నికల్లో పార్టీలకు పోలైన ఓట్లు..



అభ్యర్థి	పార్టీ	లభించిన ఓట్లు	మెజార్టీ
1972లో..			
ఎన్.నర్సప్ప	కాంగ్రెస్	25,201	9,820
గుబ్బ విశ్వనాథం	ఇండిపెండెంట్	15,381	
1978లో..			
ఎన్.నర్సప్ప	కాంగ్రెస్(ఐ)	32,707	17,740
రఘునందన్‌రెడ్డి	జనతాపార్టీ	14,967	
1983లో..			
ఎం.కృష్ణారెడ్డి	ఇండిపెండెంట్	31,803	5,818
ఎన్.నర్సప్ప	కాంగ్రెస్	25,985	
1985లో..			
ఎం.కృష్ణారెడ్డి	టీడీపీ	38,045	14,205
ఎన్.నర్సప్ప	కాంగ్రెస్	23,840	
1989లో..			
సుధాకర్‌రెడ్డి	కాంగ్రెస్	42,285	1,051
ఎం.కృష్ణారెడ్డి	టీడీపీ	41,234	
1994లో..			
సత్యనారాయణ	టీడీపీ	72,758	53,779
నర్సప్ప	కాంగ్రెస్	18,979	
1996 ఉపఎన్నికలో..			
ఎం.చంద్రశేఖర్	టీడీపీ	76,063	47,735
గున్న సుధాకర్‌రెడ్డి	కాంగ్రెస్	28,328	
1999లో..			
ఎం.చంద్రశేఖర్	టీడీపీ	49,450	24,642
మహ్మద్ అల్లాజీ	కాంగ్రెస్	24,808	
2004లో..			
సి.లక్ష్మారెడ్డి	బీఆర్ఎస్	63,480	18,381
ఎం.చంద్రశేఖర్	టీడీపీ	45,099	
2008 ఉపఎన్నికలో..			
మల్లురవి	కాంగ్రెస్	45,175	2,106
ఎం.చంద్రశేఖర్	టీడీపీ	43,069	
2009లో..			
ఎం.చంద్రశేఖర్	టీడీపీ	66,857	13,537
మల్లురవి	కాంగ్రెస్	53,320	
2014లో..			
సి.లక్ష్మారెడ్డి	బీఆర్ఎస్	70,654	14,734
మల్లురవి	కాంగ్రెస్	55,920	
2018లో..			
సి.లక్ష్మారెడ్డి	బీఆర్ఎస్	94,598	45,082
మల్లురవి	కాంగ్రెస్	49,516	

పాలమూరు విద్యార్థుల ప్రతిభ

- అంతర్జాతీయ సైన్స్ ప్రదర్శనకు హన్వాడ, అలంపూర్ విద్యార్థినులు
- అభినందించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము


దీపిక ప్రయోగాన్ని పరిశీలిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదిముర్ము

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/ అలంపూర్: ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన జాతీయ సైన్స్‌ఫేర్‌లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈనెల 7నుంచి 9వ తేదీ వరకు జపాన్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ ప్రదర్శనకు ఎంపికయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడలోని బీసీ గురుకుల విద్యార్థిని భావన, జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాల పూర్వవిద్యార్థిని దీపిక జాతీయ స్థాయిలో ప్రదర్శించిన ప్రయోగాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిలకించి అభినందించారు.


ఆటోమెటిక్ లైటనింగ్ మ్యాన్ హోల్ ప్రయోగంతో భావన

హన్వాడ బీసీ గురుకుల విద్యార్థిని భావన జిల్లాస్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి సైన్స్‌ఫేర్‌లో ప్రతిభ కనబర్చి అంతర్జాతీయ ప్రదర్శనకు సిద్ధమైంది. జాతీయ ప్రదర్శనలో 'ఆటోమెటిక్ లైటనింగ్ మ్యాన్ హోల్ ' ప్రయోగాన్ని ప్రదర్శించింది. వర్షాకాలంలో తెరుచుకున్న మ్యాన్‌హోల్స్‌ను గుర్తించక ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంటుంది. అయితే మ్యాన్‌హోల్ తెరుచుకున్న వెంటనే రెడ్‌లైట్ వచ్చి అందరినీ అప్రమత్తం చేసేలా ప్రయోగం రూపొందించినట్లు విద్యార్థిని భావన తెలిపారు. శనివారం అంతర్జాతీయ ప్రదర్శనకు బయల్దేరనున్న విద్యార్థినిని డీఈఓ రవీందర్‌తో పాటు పలువురు అధికారులు అభినందించారు.


దీపిక

అలంపూర్ మాంటిస్సోరి పాఠశాలలో 2022–23 విద్యాసంవత్సరం 10వ తరగతి పూర్తి చేసిన పోతిక దీపిక జపాన్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ సైన్స్ ప్రదర్శనకు ఎంపికై ంది. ఢిల్లీలో నిర్వహించిన జాతీయ సైన్స్ ప్రదర్శనలో 'సైంటిఫిక్ బ్యాగ్' ప్రదర్శనతో దేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముచే ప్రశంసలు అందుకున్నారు. సైంటిఫిక్ బ్యాగ్‌తో అకాల వర్షాల వల్ల ధాన్యం నష్టపోకుండా రైతులకు మేలు చేకూరుతుందని పాఠశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి తెలిపారు. పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని దీపకతో పాటు గైడ్ టీచర్ మురళీకృష్ణమోహన్, సైన్స్ ఉపాధ్యాయ బృందాన్ని ప్రిన్సిపాల్, పాఠశాల డైరెక్టర్ కేఎస్‌పీ రవిప్రకాష్ సత్కరించి అభినందించారు.


దీపికను అభినందిస్తున్న మాంటిస్సోరి పాఠశాల యాజమాన్యం

ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి రాజీనామా చేయాలి..


మాట్లాడుతున్న నాగం జనార్దన్‌రెడ్డి

- కూచుకుళ్ల మోసపూరిత మాటలను ప్రజలు నమ్మరు
- మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని మాజీమంత్రి, బీఆర్‌ఎస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని ఆయన నివాసంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి ముందుగా కాంగ్రెస్‌లోకి రాకుండా తనపై కుట్రలు, కుయుక్తులతో దొడ్డిదారిన కాంగ్రెస్‌లో చేరాడని విమర్శించారు. పార్టీలో కనీసం సభ్యత్వం లేని వ్యక్తికి కాంగ్రెస్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసి తనను మోసం చేసిందని చెప్పారు. మాట్లాడటం చేతకాని, ప్రజా సమస్యలు తెలియని వ్యక్తికి టికెట్ ఎలా ఇస్తారని అడిగినా.. కాంగ్రెస్ నుంచి సమాధానం రాలేదని తెలిపారు. నాగర్‌కర్నూల్‌లో ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి మోసపూరిత మాటలను ప్రజలు నమ్మరని అన్నారు. దామోదర్‌రెడ్డిలో కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీగా గెలిచి బీఆర్‌ఎస్ కండువా కప్పుకున్నారని, మళ్లీ బీఆర్‌ఎస్‌లో ఎమ్మెల్సీగా గెలిచి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్ కండువా కప్పుకున్నారని దుయ్యబట్టారు. ఎమ్మెల్సీ 8 ఏళ్లలో ఒక్కనాడు కూడా శాసనమండలిలో నోరు మెదపలేదన్నారు. తండ్రీకొడుకులు ఇద్దరూ దొందుదొందే అని వ్యాఖ్యానించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాను బీఆర్‌ఎస్‌లో చేరానని స్పష్టం చేశారు. కేఎల్ఐ, పాలమూరు ఎత్తిపోతల కింద నియోజకవర్గంలో ఫీడర్, డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లను ఏర్పాటుచేసి రైతులకు నీరందించాలని సీఎం కేసీఆర్‌కు కోరినట్టు తెలిపారు. కార్యక్రమంలో నాగం శశిధర్‌రెడ్డి, అర్థం రవి, లక్ష్మయ్య, బాలాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగి ఆత్మహత్య


చంద్రశేఖర్‌గౌడ్ (ఫైల్)

గోపాల్‌పేట: ఉరేసుకుని ఆర్టీసీ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం తాడిపర్తిలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. తాడిపర్తికి చెందిన చంద్రశేఖర్‌గౌడ్ (52) కొన్నేళ్లుగా ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేస్తుండేవాడు. నాలుగు నెలల కిందట ఆర్టీసీ అధికారులు చంద్రశేఖర్‌గౌడ్‌ను సస్పెన్షన్ చేశారు. అప్పటి నుంచి తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులకు తోడు కుటుంబ సభ్యులు అతడిపై కోపంతో ఇటీవల హైదరాబాద్‌కు వెళ్లారు. గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో 'భగీరథ' లైన్‌మేన్ మృతి


సతీష్ (ఫైల్)

గోపాల్‌పేట: విద్యుదాఘాతంతో మిషన్ భగీరథ పథకం లైన్‌మేన్ మృతి చెందిన ఘటన గోపాల్‌పేట మండలం తాడిపర్తిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. తాడిపర్తిలో మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ లీకేజీ అయింది. పైప్‌లైన్‌కు మరమ్మతు చేసేందుకుగాను కాశీంనగర్‌కు చెందిన వాటర్‌మేన్ సతీష్ (45) వెల్డింగ్ మిషన్‌కు విద్యుత్ కనెక్షన్ ఇచ్చే క్రమంలో ప్రమాదవశాత్తు షాక్‌కు గురయ్యాడు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

పోక్సో కేసులో 20ఏళ్ల జైలుశిక్ష

చిన్నచింతకుంట: పోక్సో కేసులో నిందితుడికి మహబూబ్‌నగర్ ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి శుక్రవారం 20ఏళ్ల జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. చిన్నచింతకుంట మండలం లాల్‌కోటకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పోగుల రాజుపై 2018లో పోక్సో కేసు నమోదైంది. కోర్టులో వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడికి 20ఏళ్ల జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని ఎస్ఐ శేఖర్ తెలిపారు.

ఏసీబీ దాడుల కలకలం

- నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో తనిఖీలు
- ఎఫ్ఐఆర్‌లో పేర్ల తొలగింపునకు లంచం డిమాండ్‌పై విచారణ
- ఎస్ఐ నివాసగృహాల్లో సోదాలు


నవాబుపేట పోలీస్‌స్టేషన్

నవాబుపేట: మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేటలో శుక్రవారం ఏసీబీ అధికారుల దాడులు కలకలం సృష్టించాయి. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించడంతో పాటు ఎస్ఐ పురుషోత్తంపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఏసీబీ డీఎస్పీ మజీద్ హుస్సేన్ వెల్లడించారు. నవాబుపేట మండలం మల్కాపూర్‌లో 4 నెలల కిందట దాయాదుల మధ్య భూతగాదా చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు దాడులు చేసుకోగా.. ఒక వర్గంలోని 9 మందిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఎఫ్ఐఆర్‌లో నమోదైన ఐదుగురి పేర్లు తొలగించేందుకు స్థానిక ఎస్ఐ పురుషోత్తం రూ.5లక్షలు డిమాండ్ చేయగా, రూ.2లక్షలకు భేరం కుదిరింది. ఈ క్రమంలో మల్కాపూర్‌కు చెందిన బాధితుడు గజ్జ శేఖర్ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు డీఎస్పీ మజీద్ హుస్సేన్ తెలిపారు. ఎస్ఐ కాల్‌డాటా ఇతర ఆధారాలు సేకరించామని, మరింత లోతుగా విచారణ చేస్తున్నట్లు వివరించారు. కాగా.. తనిఖీల్లో ఎలాంటి నగదు లభ్యం కాలేదని, కేవలం ఎఫ్ఐఆర్‌లో పేర్ల తొలగింపునకు సంబంధించి జరిగిన సంభాషణ తదితర ఆధారాలు లభించాయని తెలిపారు. బాధితుడు చేసిన ఆరోపణతో పాటు తాజాగా లభించిన ఆధారాలతో ఎస్ఐపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.

సాయంత్రం దాక సోదాలు..

ఎస్ఐ పురుషోత్తం నివాసం ఉంటున్న నవాబుపేట, మహబూబ్‌నగర్‌లోని ఇళ్లల్లో సైతం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఉదయం ప్రారంభమైన ఏసీబీ అధికారుల విచారణ.. సాయంత్రం 6గంటలు గడిచినా పూర్తి కాకపోవడం, ఎలాంటి నగదు లభించకపోవడంపై అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ఎస్ఐ ఆగడాలు వెలుగులోకి..

మహబూబ్‌నగర్ క్రైం: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నవాబుపేట ఎస్ఐ ఆగడాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. విధుల్లో చేరినప్పటి నుంచి ఇసుక దందాలు, సివిల్ సెటిల్‌మెంట్స్, భూతగాదాలు, స్టేషన్ బెయిల్ వంటి వ్యవహారాల్లో బాధితుల నుంచి భారీగా డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది.గతనెలలో ఓ ఆర్ఎంపీ నిర్లక్ష్యంతో యువకుడు మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. సదరు ఎస్ఐ దాదాపు రూ.16లక్షల వరకు సెటిల్‌మెంట్ చేశారని, దాంట్లో కొంత బాధిత కుటుంబ సభ్యులకు ఇచ్చి, మిగతాది తాను తీసుకున్నట్లు సమాచారం.

గద్వాల బీజేపీ అభ్యర్థిగా శివారెడ్డికి అవకాశం


శివారెడ్డిని ఎంపిక చేసినట్లు ప్రకటిస్తున్న డీకే అరుణ

గద్వాల రూరల్: గద్వాల నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా శివారెడ్డిని ఎంపిక చేసి పార్టీ అధిష్టానానికి పంపించినట్లు జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని డీకే బంగ్లాలో పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బీజేపీ రాష్ట్రంలో బీసీని ముఖ్యమంత్రి చేస్తామని ప్రకటించిందని, అందులో భాగంగా తాను పోటీ నుంచి తప్పుకొని బీసీ అభ్యర్థికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో అత్యధిక ఓటర్లు ఉన్న బోయ సామాజిక వర్గం నుంచి గట్టు మండలం బలిగెర గ్రామానికి చెందిన శివారెడ్డిని అందరి ఏకాభిప్రాయంతో ఎంపిక చేసినట్లు చెప్పారు. ఆయన పేరును పార్టీ అధిష్టానానికి పంపించినట్లు తెలిపారు. ఎన్నికల్లో శివారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుని బీసీల సత్తా చాటాలన్నారు. అనంతరం డీకే అరుణను బోయలు ఘనంగా సన్మానించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నందిన్నె ప్రకాష్‌రావు, వైండింగ్ రాములు, శివారెడ్డి, బండల వెంకట్రాములు, రామాంజనేయులు ఉన్నారు.

పత్తి మిల్లులో మంటలు


మంటలను ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గద్వాల క్రైం: పత్తి మిల్లులో మంటలు చెలరేగిన ఘటన శుక్రవారం సాయంత్రం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, ఫైర్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొండపల్లి శివారులోని రమ్య ఇండ్రస్టీస్ జిన్నింగ్ మిల్లులో గింజ నుంచి వేరు చేసిన పత్తిని అక్కడి కార్మికులు మిల్లు వెలుపల నిల్వ ఉంచారు. ప్రమాదవశాత్తు సాయంత్రం విద్యుదాఘాతంతో సంభవించడంతో మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు, మిల్లు సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. ఫలితం లేకపోవడంతో ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటన స్థలం వద్దకు చేరుకుని గంట పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో రూ.30 లక్షల నష్టం వాటిల్లినట్లు నిర్వాహకులు తెలిపారు. అయితే ప్రమాదానికి గల కారణాలపై విచారణ అనంతరం వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఫైర్ సిబ్బంది శంకర్ తెలిపారు. ఇదిలా ఉండగా రెండేళ్ల సంవత్సరాల క్రితం ఈ మిల్లులో అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడం విధితమే.

నగదు పట్టివేత

అమరచింత: మండలంలోని నాగల్‌కడ్మూర్ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం రూ.లక్ష 60వేల నగదు పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. మండలంలోని పాంరెడ్డిపల్లెకు చెందిన మల్లేష్ బైక్‌పై నగదు తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

కృష్ణా: మండలంలోని చేగుంట చెక్‌పోస్టు వద్ద చేపట్టిన వాహనాల తనిఖీల్లో రూ. 4,83,900 నగదును గుర్తించి సీజ్ చేసినట్లు ఎస్ఐ విజయభాస్కర్ తెలిపారు.

పెబ్బేరు రూరల్: పెబ్బేరు పట్టణంలో ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.4లక్షల 12వేల నగదును పట్టుకున్నట్లు ఎస్ఐ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. గద్వాలకు చెందిన షుగర్ వ్యాపారి గఫార్ యాక్సాబ్ బస్సులో నగదును తరలిస్తుండగా పట్టుకుని ఎన్నికల అధికారులకు అందజేసినట్లు పేర్కొన్నారు.

దేశ సముద్ధరణకు వివేకానందుని జీవితం తోడ్పాటు



జడ్చర్ల టౌన్: స్వామి వివేకానందుడి జీవితం, ఆయన రచనలు దేశ సముద్ధరణకు ఎంతగానో తోడ్పడుతున్నాయని హైదరాబాద్ రామకృష్ణ మఠం పీఠాధిపతి శితికంఠానంద స్వామిజీ సందేశమిచ్చారు. శుక్రవారం మండలంలోని గొల్లపల్లి లలితాంబికాతపోవనంలో కుంచకూరి బుచ్చిలింగం రచించిన వివేకానంద శతకం పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివేకానందుని దార్శనికత, అంతర్జాతీయ వేదికలపై ఆయన చేసిన భారతీయ ఆధ్యాత్మిక చింతన, సందేశం ప్రపంచ దేశాల దృష్టిని దేశంవైపు మళ్లించేలా చేశాయన్నారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఆర్‌జేడీ విజయలక్ష్మి, డీఈఓ రవీందర్, శివకుమార్, ఎంఈఓ మంజులాదేవి, పద్మలీల, కిరణ్మయి, దత్తుకుమార్, దుప్పల్లిరాములు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

HOUSE FOR SALE
Independent House for Sale: East Facing 184yds 2BHK at Jedcharla M: 9886154400

SERVICES

BUSINESS OFFER
ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయం, పర్యావరణానికి అనుకూలం. 100% ఆర్గానిక్ విలువలతో తయారవుతున్న బయోడిగ్రేడబుల్ కవర్లను మార్కెటింగ్ చేయుటకు డిస్ట్రిబ్యూటర్స్ డీలర్లు మరియు మార్కెటింగ్ సిబ్బంది కావలెను. సంప్రదించండి: 9848211153, 9490786468

Distribution Invitation Invest 1 Lakh and above Get up to 1 Lakh & above/Month Contact : for more info: 9010492111

WANTED
మహబూబ్‌నగర్ జిల్లా సిమ్స్ హాస్పిటల్‌లో PRO, మేనేజర్ & ఎక్స్‌పీరియన్స్ నర్సింగ్ స్టాఫ్ కావలెను. వనపర్తి వాళ్లు అవసరం Call:8886810808, 9603715551.

ప్రముఖ బ్యాంకు DSAల యందు కాంట్రాక్టు పద్ధతిలో వర్క్ చేయడానికి M/F స్టాఫ్ ఆ.కా.సు. ఇంటర్, డిగ్రీ జీ. 17K to 35K ఇంట్రెస్ట్ ఉన్న వారు వెంటనే డిటేల్స్ వాట్సాప్ చేయండి. 9885426966

రామకృష్ణ గ్రూప్స్ (TS No.1) HYD, VJA, శ్రీమంతుల ఇళ్లలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, వంట/ఇంటిపని, టీటీఆర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5వేలు కమీషన్. TS & AP అంతటా వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. ✆ 92814 52838, 82474 49036.

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం: 18K. Ph: 9848571888/ 9640400073

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి కేవలం రూ. 500/- మాత్రమే HAPPY BIRTHDAY

సాక్షి భవిత విద్యార్థుల కోసం

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపిన రీతి క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేసేముందు పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజర్

ఒకప్పుడు రేడియోలో పాటలు వింటూ, ఆ తర్వాత టీవీలో సీరియల్స్ చూస్తూ గంటలు గంటలు గడిపేసేవాళ్లు. ఇప్పుడంతా స్మార్ట్‌ఫోన్ల మయం అయిపోయింది. దీంతో ఇన్‌స్టా, ఫేస్‌బుక్, టిక్‌టాక్, మోజో మొదలైన సోషల్ మీడియా యాప్స్‌లో వచ్చే రీల్స్‌ను తెగ చూస్తున్నారు. గంటలకొద్దీ వీటినే చూస్తుండిపోతున్నారు. కొంతమందికి ఇది వ్యసనంలా మారితే, మరికొంతమంది బానిసలైపోయారు. ఇది ఆరోగ్యానికి అంతమంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొంతమంది రీల్స్ చూడడం మానేయాలనుకున్నప్పటికీ మానలేక తెగ ఇబ్బంది పడుతున్నారు. ఇటువంటి వారు ఈ కింది చిట్కాలను పాటిస్తే రీల్స్ జోలికి పోకుండా ఉండవచ్చు. అవేంటో చూసేయండి...



రీల్స్ నుంచి రిలీజ్ అవండి ఇక



● వినోదం కోసం రీల్స్ చూస్తుంటారు. ఇది వ్యసనంగా మారుతుంది కాబట్టి ఈ ఎంటర్‌టైన్మెంట్‌ను మార్చుకోవాలి. మీకు దొరికే కొద్దిపాటి సమయాన్ని మీ స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి గడపండి. మీకు ఇష్టమైన ఆటలు ఆడడం లేదా మీ హాబీలను పంచుకుంటూ సరదాగా గడపాలి. ఇలా చేయడం వల్ల కొంత సమయం మీ ఫోన్‌కు దూరంగా ఉంటారు. ఫలితంగా రీల్స్ చూడాలనిపించదు.

● వారాంతాలు, సెలవులు, ఖాళీ సమయాల్లో మొబైల్‌ఫోన్‌కు దూరంగా ఉండండి. ఇలాంటి సమయాల్లో పార్కుకెళ్లి సరదాగా నడవడం, గార్డెన్ పనులు చేయడం, కుటుంబ సభ్యులతో కలిసి సినిమా చూడడం వంటివి చేయాలి. వీటిలో ఏది చేసినా విలువైన మీ సెలవు దినం వృథా కాకపోవడంతోపాటు మీ సన్నిహితులతో కలిసి సంతోషంగా గడుపుతూ వారికి మరింత దగ్గరవుతారు.

● మీ ఫోన్లో నోటిఫికేషన్స్‌ను ఆపేయాలి. టిక్‌టిక్ అంటూ పదేపదే వచ్చే నోటిఫికేషన్స్ రీల్స్ చూడాలని మెదడుని ప్రేరేపిస్తాయి. మీకు తెలియకుండానే రీల్స్ ఓపెన్ చేసి గంటలకొద్దీ వాటిలో మునిగి పోతుంటారు. అందుకే రీల్స్ నోటిఫికేషన్స్ ఆపేయడం ఉత్తమం.

● ఫోన్‌ను ఎంతసేపు చూడాలనేది మీ నియంత్రణలో ఉండాలంటే అలారం పెట్టుకోండి. మీరు ఫోన్‌లో మునిగిపోయి ఉన్నప్పుడు అలారం హెచ్చరికతో తేరుకుని నియంత్రణలో ఉండగలుగుతారు.

● ఇవన్నీ చేసినప్పటికీ రీల్స్‌ని చూడకుండా ఉండలేకపోతే... రీల్స్ వచ్చే అన్ని అప్లికేషన్లు లేదా యాప్స్‌ను శాశ్వతంగా తీసేయండి. అప్పుడు చూడాలనిపించినా అవి ఉండవు కాబట్టి మిమ్మల్ని మీరు నియంత్రించుకో గలుగుతారు. ఇవి లేనప్పుడు వేరే కొత్త హాబీ మీ రోజువారీ దినచర్యలో భాగం అవుతుంది. తద్వారా ఆరోగ్యకరమైన, సంతోషంతో కూడిన మార్పులు చోటుచేసుకుని ఆత్మస్థైర్యం పెరుగుతుంది. ప్రయత్నించి చూడండి.

సీజనల్ వ్యాధులు

సురక్షితం ఇలా!

గత కొద్దిరోజులుగా రెండు తెలుగు రాష్ట్రాలలోనూ ఇంచుమించు ప్రతి ఇంట్లోనూ దగ్గు, జలుబు, తుమ్ములు, జ్వరం వంటి వాటితో ఎవరో ఒకరు బాధపడుతూనే ఉన్నారు. సీజనల్ వ్యాధుల విజృంభణే అందుకు కారణం. ఇది ప్రతి సీజన్‌లోనూ ఉండేదే అయినా, ఒక్కొక్కరికి ఒక్కో సీజన్ బొత్తిగా పడదు. అందువల్ల వచ్చాక బాధపడేకంటే వీటిని నివారించుకోవడమే ఉత్తమం. సీజనల్ వ్యాధులను నివారించుకోవడం ఎలాగో తెలుసుకుందాం...

కొన్ని నివేదికల ప్రకారం, గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది సీజనల్ వ్యాధుల కేసులు గణనీయంగా పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. శ్వాసకోశ ఇన్ఫెక్షన్లలో పెరుగుదల ఉన్నట్లు వైద్యనిపుణులు గుర్తించారు. ముఖ్యంగా పట్టణాలలో ఈ సమస్యలు అధికంగా ఉన్నాయి. వాయుకాలుష్యమే ఇందుకు ప్రధాన కారణం.

ఎలా నివారించాలి?

● శరీరంలో రోగనిరోధక వ్యవస్థ బలహీనపడటం వల్లే ఈ తరహా సీజనల్ ఇన్ఫెక్షన్లు దాడి చేస్తుంటాయి. ఈ సమస్యల నుండి బయటపడాలంటే బలమైన రోగనిరోధక వ్యవస్థను కలిగి ఉండటం ఒక్కటే మార్గం.

● రోగనిరోధక వ్యవస్థను బలపరుచుకోవాలంటే... ఆహారంలో వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ప్రోటీన్లు, తృణధాన్యాలు ఉండేలా చూసుకోవాలి. మంచి పోషకాహారం తీసుకునే వారికి అంటువ్యాధులు సోకే ప్రమాదం తగ్గుతుంది.

● వ్యాయామం రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడమే కాకుండా ఒత్తిడిని తగ్గిస్తుంది కాబట్టి ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు వారానికి కనీసం 150 నిమిషాలకు తగ్గని శారీరక వ్యాయామం అవసరం.

● తగినంత నిద్ర

నిద్ర లేకపోవడం శరీరానికి రక్షణగా ఉండే రోగనిరోధక వ్యవస్థను బలహీనపరుస్తుంది. శరీరానికి తగినంత రోగనిరోధక శక్తి కలగాలంటే రోజూ కనీసం ఆరున్నర నుంచి 8 గంటల రాత్రి నిద్ర అవసరం. రాత్రిళ్లు డ్యూటీ చేసేవారు పగలు మరింత ఎక్కువ సమయాన్ని నిద్రకు కేటాయించాలి.



● ఫ్లూ టీకాలు

ఫ్లూ నుంచి రక్షణ పొందేందుకు ప్రతి ఏడాది టీకాలు తీసుకోవడం అవసరం. ఇలా టీకాలు తీసుకోవటం వల్ల ఫ్లూ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు.



● పరిశుభ్రతను పాటించడం

ఏదైనా వస్తువులను, బహిరంగ ప్రదేశాలను తాకిన తరువాత కనీసం 20 సెకన్లపాటు సబ్బుతో చేతులను కడగాలి.

● తగినంత దూరం పాటించడం

తెలిసిన వ్యక్తులు, సన్నిహితులు అనారోగ్యంతో ఉన్నప్పుడు వారిని పలకరించండి. చూడటానికి వెళ్లండి కానీ సురక్షితమైన దూరం పాటించటానికి ప్రయత్నించడాన్ని మాత్రం మరచిపోరాదు.

● సీజనల్ వ్యాధులలో వైరస్, బాక్టీరియా, ఫంగస్ కారణంగా వచ్చే సైనసైటిస్ వల్ల ముక్కుతోపాటు గొంతు సంబంధిత సమస్యలు ఏర్పడతాయి. తలనొప్పి కూడా వస్తుంది. వచ్చిందంటే ఒకపట్టాన వదలకుండా కొన్ని రోజులపాటు పట్టి పీడించే ఈ వ్యాధి నుంచి బయటపడేందుకు చిన్న చిన్న చిట్కాలు ఎంతగానో దోహదపడతాయి.

● ఉల్లి, వెల్లుల్లి రేకులను తింటే సైనసైటిస్ బాధ తగ్గుతుంది. వంటకాల్లో ఉల్లి, వెల్లుల్లి విరివిగా వాడితే మంచిది.

● టీ స్పూన్ జీలకర్రను వేయించి పొడిచేసి, అందులో రెండు స్పూన్ల తేనె కలిపి రోజుకు రెండుసార్లు తీసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. జీలకర్రను పల్చని కాటన్ వస్త్రంలో కట్టి వాసన పీల్చాలి.

● గ్లాసున్నర నీళ్లలో టీ స్పూన్ మెంతులను వేసి బాగా మరిగించి కషాయం కాయాలి. ఈ కషాయాన్ని రోజుకు నాలుగుసార్లు తీసుకోవాలి.

● క్యారట్ జ్యూస్‌లో పాలకూర రసం కలిపి రోజుకు ఒకసారి తాగాలి.

ఇలా చేయడం వల్ల సీజనల్ వ్యాధుల నుంచి సురక్షితంగా బయట పడవచ్చు.

లైఫ్@360

చిక్కుళ్లు తింటే అనారోగ్యానికి చిక్కరు



ఈ సీజన్‌లో అంటే చలి కాలంలో విరివిగా దొరికే చిక్కుళ్లను మన ఆహారంలో చేర్చుకుంటే శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఎందుకంటే చిక్కుడు కాయలలో అనేక పోషకాలు ఉంటాయి. ఎంతో రుచిగా ఉండే చిక్కుడు కాయలు తింటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలేమిటో తెలుసుకుందాం...

★ చిక్కుడుకాయలలో మెగ్నీషియం, ఐరన్, ఫాస్పరస్, జింక్, పీచు పదార్థాలు, క్యాల్షియం, ఫోలిక్ యాసిడ్, మాంసకృత్తులు వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వీటితోపాటు యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు కూడా ఉంటాయి.

★ వీటిని కూరల రూపంలో లేదా గింజలను ఉడికించి తినడం ద్వారా... ఇలా ఏదో ఒక విధంగా రెగ్యులర్ గా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది. ఇవి శరీరానికి తగిన శక్తిని అందించి వ్యాధులతో పోరాడే సామర్థ్యాన్ని పెంచి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇవి హృద్రోగాలు, క్యాన్సర్ వంటి సమస్యను కూడా దూరం చేస్తాయి.

★ చిక్కుడుకాయలలో ఉండే క్యాల్షియం, విటమిన్ డి ఎముకలకు వల్ల ఎముకలు దృఢంగా మారుతాయి. గర్భిణులు, బాలింతలు, వ్యాయామం చేసేవారికి చిక్కుళ్లు చాలా మంచిది.

చిక్కుడుకాయలు దొరకనప్పుడు ఎండిన చిక్కుడు గింజలను కూడా కూరల్లో ఉపయోగించవచ్చు. బరువు తగ్గాలనుకునే వారు వారి డైట్‌లో చిక్కుడుకాయలను చేర్చుకోవడం ఉత్తమం.

★ చిక్కుడు కాయలను తింటే ఆకలి తగ్గుతుంది. ఫలితంగా బరువు నియంత్రణలో ఉంటుంది. వీటిలో ఉండే పీచు పదార్థం జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేయడంతో పాటు పేగు క్యాన్సర్లు రాకుండా చూస్తుంది. డయేరియా, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు దరి చేరవు. చిక్కుళ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు వృద్ధాప్యం కారణంగా వచ్చే అనేక వ్యాధులను నివారిస్తాయి.

★ చిక్కుడు కాయలలో ఉండే విటమిన్లు గుండె ఆరోగ్యానికి దోహదపడతాయి. సెలీనియం, మాంగనీస్ వంటి ఖనిజాలు చిక్కుడు కాయలలో సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఊపిరితిత్తుల సమస్యలను నివారించడానికి, దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలను తగ్గించడానికి దివ్యౌషధంగా సహాయపడతాయి. ఇందులో ఉండే మాంగనీస్ నిద్రలేమి సమస్యలను తగ్గించడానికి సహాయపడుతుంది.

★ చిక్కుడు కాయలలోని అమైనో ఆమ్లాలు హార్మోన్ల సమతౌల్యానికి సహాయపడతాయి. దీంతో మానసిక ఆందోళన, టెన్షన్ వంటి సమస్యలు తగ్గుతాయి. అలాగే ఇందులో ఉండే పొటాషియం కండరాల వృద్ధికి సహాయపడుతుంది. అంతేకాదు, మెదడు పనితీరును మెరుగుపరిచి జ్ఞాపకశక్తిని పెంచుతుంది.

ఇన్ని ప్రయోజనాలుండే చిక్కుళ్లను తీసుకోవడం అలవరచుకుంటే అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండి ఆరోగ్యంగా ఉండవచ్చు.

హెల్త్ టిప్స్



* ఎండలో ఎక్కువ సేపు తిరగడం వల్ల తలనొప్పి వచ్చినా తల తిరిగినట్లుగా ఉన్నా చిన్న అల్లం ముక్కను నూరి నిమ్మరసంలో కలిపి తాగితే వెంటనే ఉపశమనం కలుగుతుంది.
* ముక్కు దిబ్బెడ వేసినప్పుడు ఒక చుక్క ఉల్లిరసాన్ని ముక్కు రంధ్రాల్లో వేస్తే ఉపశమనం కలుగుతుంది.
* సగానికి కోసిన నిమ్మచెక్కపై ఉప్పు, మిరియాల పొడి చల్లి కొద్దిగా వేడి చేసి రసం పిండుకొని తాగితే మైగ్రెయిన్ తలనొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.
* నిమ్మరసం, తేనె, గ్లిసరిన్ సమపాళ్లలో కలిపి చెంచా చొప్పున రోజుకు మూడుసార్లు తీసుకుంటే దగ్గు తగ్గుతుంది.
* నిద్రలేమితో బాధపడుతున్నవారు పడుకునే ముందు కొత్తిమీర రసం, పంచదార కలిపిన నీళ్లను తాగితే ఫలితం ఉంటుంది.
* రక్తంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గించుకొని సన్నబడాలంటే రోజూ పెరుగును తీసుకోవాలి.
* గుండె ఆరోగ్యంగా ఉండాలంటే కొవ్వు పదార్థాలు తక్కువ వుండే ఆహారపదార్థాలు తీసుకోవాలి.
* మధుమేహంతో బాధపడేవారు నిత్యం ఆహారంలో ఉల్లి, వెల్లుల్లి ఉండేలా చూసుకుంటే ఎంతో మేలు.
* రాత్రి 7 నుంచి 8 గంటల లోపు ఆహారం తీసుకోవడం, తిన్న తరువాత కనీసం ఒక అరగంట నాటి అయినా నడవడం అలవాటు చేసుకోవడం వల్ల అరుగుదల బాగుండడంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు కూడా దరిచేరకుండా ఉంటాయి.

సినిమా

భారతీయుడు ఈజ్ బ్యాక్



● కమల్‌హాసన్

''హలో... ఏ తప్పు జరిగినా నేను తప్పకుండా వస్తాను. భారతీయుడుకి చావే లేదు' అంటూ 'ఇండియన్' ('భారతీయుడు') చిత్రం చివర్లో కమల్‌హాసన్ చెప్పే డైలాగ్‌తో 'ఇండియన్ 2' ('భారతీయుడు 2') ఇంట్రో గ్లింప్స్ మొదలవుతుంది. కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన 'ఇండియన్' (1993)కి సీక్వెల్‌గా 'ఇండియన్ 2' తెరకెక్కుతోంది. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో సిద్ధార్థ్, ప్రియా భవానీ శంకర్, రకుల్ ప్రీత్ సింగ్, ఎస్‌జే సూర్య, బాబీ సింహా కీలక పాత్రధారులు. సుభాస్కరన్, ఉదయ నిధి స్టాలిన్ నిర్మిస్తున్నారు. శుక్రవారం 'ఇండియన్ 2' ఇంట్రో గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. ''భారతీయుడు ఈజ్ బ్యాక్' అంటూ 'ఇండియన్ 2' తెలుగు వెర్షన్ గ్లింప్స్‌ను దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి షేర్ చేశారు. ఈ వీడియోలో 'నమస్తే ఇండియా.. భారతీయుడు ఈజ్ బ్యాక్' అంటూ కమల్‌హాసన్ చెప్పిన డైలాగ్ ఉంటుంది.

నన్ను తమిళ అబ్బాయిలా ఉన్నావనేవారు

- నాని



● ఎస్ఆర్ ప్రభు, రాజు మురుగన్, కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్, నాని, వంశీ పైడిపల్లి

''ఈగ సినిమా తమిళంలో విడుదలైన తర్వాత నేను ఎప్పుడు చెన్నై వెళ్లినా.. నన్ను తమిళ అబ్బాయిలా ఉన్నావనేవారు. అలాగే కార్తీని చూస్తే చాలామంది తెలుగు ప్రేక్షకులు తెలుగబ్బాయిలా ఉన్నాడంటారు. నాకు తెలిసి తెలుగు ప్రేక్షకులు కార్తీని సొంతం చేసుకున్నారు. వరుసగా మూడు హిట్స్ సాధించి ఇప్పుడు 'జపాన్'తో ముందుకొస్తున్నాడు కార్తీ. దీపావళికి వస్తున్న ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'' అని హీరో నాని అన్నారు. కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా నటించిన చిత్రం 'జపాన్'. రాజు మురుగన్ దర్శకత్వంలో ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఈనెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన **నాని మాట్లాడుతూ** – ''జపాన్' లాంటి చిత్రం తీసి ప్రేక్షకుల్ని మెప్పించడం అంత సులభం కాదు. కానీ, ఈ మూవీ ట్రైలర్ చూశాక టీమ్ ఎనర్జీ, నమ్మకం నాకు కనిపించింది. అనూ ఇమ్మాన్యుయేల్ నా 'మజ్ను' సినిమాతో పరిచయమైంది. 'జపాన్' ట్రైలర్ చూసినప్పుడు చాలా మంచి సినిమాలో భాగస్వామ్యం అయినట్లు అనిపించింది. ప్రభుగారు మంచి సినిమాలు నిర్మిస్తుంటారు. లెక్కలు చూసుకుని పని చేసే నిర్మాత కాదు.. ప్యాషన్‌తో, ప్రాణం పట్టి పనిచేసే నిర్మాతలాగా అనిపిస్తారు. ఇలాంటి మంచి సినిమా తీసిన డైరెక్టర్ రాజు మురుగన్‌కి అభినందనలు'' అన్నారు. ''జపాన్' నా మనసుకు బాగా దగ్గరైంది'' అన్నారు **కార్తీ**. ''జపాన్' అంతా రాజు మురుగన్ శైలిలో ఉంటుంది. ఈ సినిమా ప్రేక్షకులను నిరుత్సాహ పరచదు. అన్నపూర్ణ స్టూడియోస్ భాగస్వామ్యంలో తెలుగులో ఈ సినిమా విడుదల చేస్తుండటం సంతోషంగా ఉంది'' అని **ఎస్ఆర్ ప్రభు** అన్నారు. **రాజు మురుగన్ మాట్లాడుతూ**– ''కళకు భాషతో సంబంధం లేదు. తెలుగు ప్రేక్షకులు సినిమాని పండగలా సెలబ్రేట్ చేసుకుంటారు. భారతీయ సినిమాకి ఐకానిక్‌గా గుర్తింపు పొందింది టాలీవుడ్'' అన్నారు. ఈ వేడుకలో నిర్మాత సుప్రియ, దర్శకుడు వంశీ పైడిపల్లి, నటులు సునీల్, రాకేందు మౌళి, పాటల రచయిత భాస్కరభట్ల తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిగా ఆమె నాకోసం కష్టపడుతున్నారు

- సమంత



''చెడుపై మంచి సాగించే అంతిమ యుద్ధంలో ఈసారి ఒకరు కాదు ముగ్గురు సూపర్ హీరోలు పోరాడుతున్నారు. ఈ దీపావళికి యాక్షన్ ప్యాక్డ్ రైడ్‌లా వస్తున్న 'ది మార్వెల్స్' సినిమా చూడటానికి ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా'' అన్నారు హీరోయిన్ సమంత. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా 'కెప్టెన్ మార్వెల్'కు సీక్వెల్‌గా నియా డకోస్టా దర్శకత్వంలో 'ది మార్వెల్స్' రూపొందింది. కెప్టెన్ మార్వెల్‌గా బ్రీ లార్సన్, మిస్ మార్వెల్‌గా ఇమాన్ వెల్లనీ, మోనికాగా తెయోనా పారిస్ నటించారు. మార్వెల్ స్టూడియోస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, ఇంగ్లిష్, హిందీ, తమిళ భాషల్లో ఇండియాలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం 'ది మార్వెల్స్' ప్రోమోను రిలీజ్ చేసిన సమంత మాట్లాడుతూ– ''మహిళా శక్తిని బలపరిచే చిత్రాలను ప్రోత్సహించేందుకే ఇక్కడకు వచ్చాను. నేను ఓ అవెంజర్ అయి, నాకో టీమ్ ఉంటే అందులో నా ఫ్యాన్స్ ఉండాలని కోరుకుంటాను. ఇండస్ట్రీ వారు టీమ్‌గా ఉండాలనుకుంటే అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ, ఆలియా భట్, ప్రియాంకా చోప్రా ఉండాలనుకుంటా. నా మొదటి హీరో మా అమ్మే. ఏడాదిగా ఆమె నా కోసం ఎంతో కష్టపడుతున్నారు'' అన్నారు.

ఆవకాయ తాండ్ర...



● తరుణ్ భాస్కర్

'అప్పడప్పడ తాండ్ర ఆవకాయ తాండ్ర...' అంటూ చిందేశారు దర్శకుడు తరుణ్ భాస్కర్. అజయ్ భూపతి దర్శకత్వం వహించిన 'మంగళవారం' చిత్రంలోని పాట ఇది. పాయల్ రాజ్‌పుత్, అజ్మల్ అమీర్ జంటగా స్వాతి రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం నిర్మించారు. బి. అజనీష్ లోక్‌నాథ్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'అప్పడప్పడ తాండ్ర...' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు. తరుణ్ భాస్కర్, గణేష్ ఎ. రాసిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ఈ ప్రత్యేక పాటలో తరుణ్ భాస్కర్ నటించడం విశేషం. ''తరుణ్ భాస్కర్ గెటప్, లుంగీలో డాన్స్ చేయడం ఈ పాట ప్రత్యేకత. కోనసీమలోని ఓ పల్లెటూరిలో చిత్రీకరించిన ఈ పాట పల్లె ప్రజల మధ్య సంభాషణలు, ఊరిలో పరిస్థితులను తెరపై ఆవిష్కరించేలా ఉంటుంది'' అన్నారు అజయ్ భూపతి.

స్వర్గం నరకం ఈశ్వరరావు ఇక లేరు



సీనియర్ నటుడు ఈశ్వరరావు కన్నుమూసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అమెరికాలోని మిచిగాన్‌లో ఉన్న తన కుమార్తె ఇంటికి వెళ్లిన ఆయన అనారోగ్య కారణంతో అక్టోబర్ 31న తుది శ్వాస విడిచారు. దాసరి నారాయణరావు దర్శకత్వం వహించిన సూపర్ హిట్ చిత్రం 'స్వర్గం నరకం' (1975) ద్వారా వెండితెరకు పరిచయం అయ్యారు ఈశ్వరరావు. ఈ చిత్రంలో తన నటనకుగాను కాంస్య నంది అవార్డును అందుకున్నారు ఈశ్వరరావు. ఆ తర్వాత 'దేవతలారా దీవించండి', 'ప్రేమాభిషేకం, యుగపురుషుడు, దయామయుడు, ప్రెసిడెంట్‌గారి అబ్బాయి, జయం మనదే, శభాష్ గోపి' తదితర చిత్రాల్లో నటించి, ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారాయన. చిరంజీవి హీరోగా కె.రాఘవేంద్ర రావు దర్శకత్వం వహించిన 'ఘరానా మొగుడు' (1992) సినిమాలో చివరిసారిగా కనిపించారు ఈశ్వరరావు. దాదాపు 200కు పైగా చిత్రాల్లో నటించారు. పలు సీరియల్స్‌లో నటించి బుల్లితెర ప్రేక్షకులనూ అలరించారాయన. ఈశ్వరరావు మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్



● వేణుగోపాల్, విక్రమ్ రెడ్డి, 'దిల్' రాజు

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జం నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ 90 శాతం పూర్తయింది. ఈ టైటిల్ లోగో రిలీజ్ చేసిన నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ఈ సినిమా కథ విన్నాను. కొత్త కంటెంట్ ఉన్న చిత్రాలను మన ఆడియన్స్ ఆదరిస్తారు. ఈ చిత్రం కూడా ఇదే కోవలో ఉంటుందని ఆశిస్తున్నాను'' అన్నారు. ''పక్కా యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఫిల్మ్ ఇది'' అన్నారు వేణుగోపాల్, విక్రమ్.

ఇరవై ఏళ్లకు నా కల నెరవేరింది

- ఆర్‌పి వెంకట్



''ఒకసారి ఫ్రెండ్స్‌తో కలిసి సినిమా చూస్తున్నప్పుడు నాకు 'దీపావళి' కథ ఆలోచన పుట్టింది. పల్లెటూరు, అక్కడి ఓ ముసలి వ్యక్తి, మనవడు, వారు ప్రేమగా పెంచుకునే మేక పిల్ల.. ఈ అంశాలను కనెక్ట్ చేస్తూ భావోద్వేగాలతో 'దీపావళి' తీశాను'' అని దర్శకుడు ఆర్‌పి వెంకట్ అన్నారు. 'స్రవంతి' రవికిశోర్ తొలిసారి తమిళంలో నిర్మించిన చిత్రం 'కీడా'. తెలుగులో 'దీపావళి' పేరుతో అనువదించారు. పూ రాము, కాళీ వెంకట్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం ఈ నెల 11న తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు ఆర్‌పి వెంకట్ మాట్లాడుతూ– ''మాది తమిళనాడు. 2003లో చెన్నైలో ఆఫీస్ బాయ్‌గా నా జీవితం ప్రారంభించి, అసిస్టెంట్, అసోసియేట్ డైరెక్టర్‌గా చేశాను. దర్శకునిగా 'దీపావళి' నా తొలి సినిమా. 20 ఏళ్ల తర్వాత నా కల నిజమైంది. రవికిశోర్‌గారి తొలి తమిళ సినిమాకు నేనే డైరెక్టర్ అని చెప్పుకోవటం ఎంతో గర్వంగా ఉంది. నా తర్వాతి సినిమా కోసం ఎమోషనల్ పాయింట్‌తోనే ఓ కథను సిద్ధం చేస్తున్నాను. రవికిశోర్‌గారికి నచ్చింది. ఈ సినిమాని ఓ స్టార్ హీరోతో చేసే ఆలోచనలో ఉన్నాం'' అన్నారు.

తెరచాప ఆడాలి

- విశ్వక్ సేన్



● విశ్వక్ సేన్, నవీన్ రాజ్

నవీన్ రాజ్ సంకరపు, పూజా సుహాసిని ముఖ్య తారలుగా నటిస్తున్న చిత్రం 'తెరచాప'. జోయల్ జార్జ్ దర్శకత్వంలో కైలాష్ దుర్గం నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్‌ను హీరో విశ్వక్ సేన్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''టైటిల్ డిజైనింగ్ బాగుంది. ఈ సినిమా కథ, కథనం, టేకింగ్, అన్నీ నాకు తెలుసు. ఈ సినిమా బాగా ఆడి, చిత్ర యూనిట్‌కి మంచి విజయాన్ని చేకూర్చాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రజ్వల్ క్రిష్, కెమెరా: అజీమ్–వెంకట్.

మార్పు కోసం..



● సుమన్

సుమన్, అజయ్ ఘోష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జనం'. వెంకటరమణ పసుపులేటి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 10న రిలీజ్ అవుతున్న సందర్భంగా వెంకటరమణ పసుపులేటి మాట్లాడుతూ– ''ప్రజలకు మంచి చేయాలని రాజకీయాల్లోకి వచ్చే నాయకులు తప్పుదారి పట్టిన ప్రజల ఓట్ల కోసం, ఎన్నికల్లో గెలవడం కోసం ఎలా తప్పు దారి పడుతున్నారు? అనే నేపథ్యంలో ఈ చిత్రకథ సాగుతుంది'' అన్నారు.

పైరసీకి అడ్డుకట్ట వేస్తాం

- కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్



''పైరసీ కారణంగా ప్రతి ఏడాది వినోద రంగానికి రూ.20 వేల కోట్లు నష్టం వాటిల్లుతోంది. ఓ సినిమా నిర్మాణానికి పడ్డ కష్టం పైరసీ వల్ల వృథాగా పోతోంది. పైరసీని అడ్డుకోవడానికి కేంద్ర ప్రసార, సమాచార మంత్రిత్వ శాఖలో నోడల్ ఆఫీసర్స్‌ను నియమించడం జరిగింది'' అని కేంద్ర ప్రసార, సమాచార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. ఇటీవల సినిమాటోగ్రఫీ చట్టం–1952లో సవరణలు చేసి, కొత్త బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించిన విషయం తెలిసిందే. ఇందులో పైరసీని అరికట్టడం అనేది ఓ ప్రధానాంశం. ఈ విషయమై శుక్రవారం అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ– '' ముంబైలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ కార్యాలయంలో, ప్రాంతీయ కార్యాలయాల్లో పైరసీ, డిజిటల్ పైరసీల ఫిర్యాదులను స్వీకరించేందుకు అధికారులను నియమించాం. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో ఉన్న పైరేటెడ్ కంటెంట్‌పై నోడల్ ఆఫీసర్స్‌కు ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులు 48 గంటల్లో ఆ కంటెంట్‌ను ఆ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ నుంచి తొలగించేలా చర్యలు చేపడతారు'' అని చెప్పుకొచ్చారు.